ప్రజల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 8 : ప్రజల రక్షణ కోసం పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆపద సమయంలో డయల్ 100ను సంప్రదిస్తే జీపీఎస్ ఆధారంగా క్షణాల్లో సాయమందిస్తామన్నారు. విద్యార్థినులు, మహిళలు అత్యవసర పరిస్థితులలో కంట్రోల్ రూం నంబర్ 8712656597, షీ టీం నంబర్ 6303923700లో సంప్రదించాలని, వాట్సప్ ద్వారా సందేశం, లేదా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. మత్తు పదార్థాలు రవాణా చేసినా, పందేలు ఆడినా, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసినా 8712656597, 8712656607కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ మోసాలకు పాల్పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ కి లేదా https://cybercrime.gov.in/ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. పోలీసు సిబ్బందికి రెయిన్ కోట్స్ అందజేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

చెన్నూర్ రూరల్ : పొలంబాటలో పాల్గొన్న ఏడీఈ రవికుమార్

చెన్నూర్ రూరల్, ఆగస్టు 8 : పంట పొలాల వద్ద రైతులు విద్యుత్ వాడకంపై పలు జాగ్రత్తలను తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ రవికుమార్ సూచించారు. చెన్నూర్ మండలం అక్కెపల్లి, ఆస్నాద్ గ్రామాల్లో ఏఈలు భాస్కర్, శ్రీనివాస్‌తో కలిసి విద్యుత్‌శా పొలంబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులు మోటర్ల వద్ద కెపాసిటర్లు అమర్చుకోవాలని, తడి చేతులతో పంపులను తాకవద్దని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా స్థానిక లైన్‌మన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దింటి రాజన్న, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్షెట్టిపేట, ఆగస్టు 8 : మండలంలోని తిమ్మాపూర్‌లో విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట నిర్వహించారు. ఏడీఈ ప్రభాకర్‌రావు, ఏఈ గణేశ్ సిబ్బందితో పంట పొలాల్లో తిరుగుతూ వంగి ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు, శిథిలావస్థలో ఉన్నవాటికి మరమ్మతులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ లైన్‌మన్, రైతులు పాల్గొన్నారు.

వారసంతలో అన్నదానం

రెబ్బెన, ఆగస్టు 8: రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామంలో గురువారం వారసంతలో గోలేటి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు సభ్యులు వసీం, మోయిజ్, అద్నాన్ తెలిపారు. ప్రతి గురువారం వారసంతలో అన్నదానం ప్రారంభించి సంవత్సరం పూర్తయిందని తెలిపారు.

వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్థం

- వార్డుల్లో అలుముకున్న చీకట్లు
- రాత్రుళ్లు ఇబ్బందిపడుతున్న ప్రజలు, ప్రయాణికులు
- నెలనెలా నిర్వహణ సంస్థకు డబ్బు చెల్లిస్తున్న మున్సిపాలిటీ
- నిర్వహణ లేనప్పుడు ఇవ్వడంపై చైర్మన్ ఆగ్రహం

మంచిర్యాలటౌన్, ఆగస్టు 8 : మంచిర్యాల మున్సిపాలిటీలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్థంగా తయారైంది. ప్రధాన రహదారులపై సెంట్రల్‌లైటింగ్ సిస్టంతో పాటు, వార్డుల్లోని కూడళ్లలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లు, వీధుల్లోని ఎల్ఈడీ లైట్లు చాలా చోట్ల వెలగకపోవడంతో చాలా ప్రాంతాల్లో చీకటి అలుముకుంటున్నది. పట్టణంలోని 36 వార్డుల్లో దాదాపుగా ఈ సమస్య వెంటాడుతున్నది. నిత్యం కౌన్సిలర్లు తమ వార్డుల్లో వీధి దీపాలు వెలగడం లేదని అధికారుల దృష్టికితీసుకెళ్లినా.. పట్టింపుకరువైంది.

2018 నుంచి పట్టణంలో వీధి దీపాల నిర్వహణ బాధ్యతను ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫీషియంట్ సర్వీసెస్ లిమిటెడ్) సంస్థకు మున్సిపాలిటీ అప్పగించింది. దీంతో అప్పుడు ఉన్న ట్యూబులైట్లు, ఇతర బల్బులను తొలగించి, వాటి స్థానంలో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేసింది. తగ్గిన కరెంట్ బిల్లులో కొంత మొత్తాన్ని మున్సిపాలిటీ ఆ సంస్థకు చెల్లిస్తూ వస్తున్నది. అయితే ఏడేళ్ల పాటు, వీధి దీపాల నిర్వహణ బాధ్యత చేపట్టాల్సి ఉండగా, ఆ సంస్థ పట్టనట్లు వ్యవహరిస్తున్నది. ఈ ఏడాది అక్టోబర్‌తో ఈ సంస్థతో చేసుకున్న ఒప్పందం ముగియనున్నది. గడిచిన రెండేళ్లుగా వీధి దీపాల బాధ్యతలను గాలికొదిలేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవి ఇవ్వడంగానీ, చెడిపోయిన పరికరాలకు మరమ్మతులు చేయించడం గానీ, కొత్తగా కొనుగోలు చేయడం గానీ చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా సంస్థకు సంబంధించిన ఉద్యోగులు ఇక్కడ ఉండటం లేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ఎక్కడైనా అత్యవసరమైతే మున్సిపల్ సిబ్బందే ఆ పనులను చేస్తున్నారు. కానీ, వీధి దీపాల నిర్వహణ చేయాల్సిన సంస్థకు మాత్రం నెలనెలా మంచిర్యాల మున్సిపాలిటీ నుంచి రూ.11 లక్షలను ఇస్తున్నారు. పాలకవర్గ సభ్యులు చేసేదిలేక కౌన్సిల్‌లో తీర్మానం చేసిన బల్బులు, ఇతర పరికరాల కొనుగోలుకు డబ్బు కేటాయించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం పట్టణంలో సెట్రల్ లైటింగ్ సిస్టం, హైమాస్ట్ లైటింగ్ సిస్టం లైట్లు 1634, వీధుల్లో విద్యుత్ దీపాలు 12,841 ఉన్నాయి. వీటిలో 18 వాట్ల బల్బులు 12,300.., 70వాట్ల బల్బులు 541.., 110 వాట్ల బల్బులు 1236.., 190 వాట్ల బల్బులు 398 ఉన్నాయి. నిర్వహణ లేకపోయినా ప్రైవేటు సంస్థకు నెలనెలా డబ్బు ఇవ్వడంపై చైర్మన్ ఉప్పలయ్య ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ లేకున్నా, సామగ్రి ఇవ్వకున్నా డబ్బులు చెల్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది చాలా దారుణమైన విషయమని, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

మంచిర్యాల పట్టణంలో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం

కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం

కోటపల్లి/దండేపల్లి/బెల్లంపల్లి/తాండూర్/చెన్నూర్/వేమనపల్లి/కాగజ్‌నగర్/చింతలమానేపల్లి/రెబ్బెన/కెరమెరి/కాసిపేట/మందమర్రి/పెంచికల్‌పేట్, ఆగస్టు 8 : జిల్లాలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అధికారులు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం కోటపల్లి మండలంలోని కొల్లూరు పారుపల్లి, పిన్నారం గ్రామాలను డీపీవో వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. పనులను పరివీలించారు. దండేపల్లి మండలం ఊట్ల సమీపంలోని పెద్దయ్యగుట్ట వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో చెత్త తొలగించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ 22వ వార్డులో దోమల మందు పిచికారీ చేశారు. తాండూర్ మండలంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. చెన్నూర్ పట్టణంలో ర్యాలీ తీసి, వార్డులవారీగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వేమనపల్లి మండలం నీల్వాయి, మామడ గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పర్యటించారు. కాగజ్‌నగర్ 20వ వార్డు కౌన్సిలర్ తాటి జయచందర్ మొక్కలను పంపిణీ చేశారు. చింతలమానేపల్లి మండలం చింతలమానేపల్లి-బాలాజీ అనుకోడ ప్రధాన రహదారికి ఇరువైపులా 220, కర్జెల్లిలోని శ్రీ కృష్ణ ఆశ్రమ పరిసరాల్లో అధికారులతో కలిసి ఎంపీడీవో కోట ప్రసాద్ మొక్కలు నాటారు. రెబ్బెన మండలంలోని పులికుంట, గోలేటి జీపీల్లో అధికారులతో ఎంపీడీవో శంకరమ్మ మొక్కలు నాటారు. కెరమెరి మండలం చౌపన్‌గూడ, ఝరి, కెస్లాగూడల్లో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎంపీడీవో మహ్మద్ అబ్దుద్‌పాషా, ఎంఎన్‌వో ప్రకాశ్, ఏపీవో మల్లయ్య మొక్కలు నాటారు. కాసిపేట మండలం కొండాపూర్, కొనూర్, లంబాడీతండా(డీ), ధర్మరావుపేట, తాటిగూడల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి మాడావి గంగారాం తనిఖీ చేశారు. మోడల్ స్కూల్, ముత్యంపల్లి పరిధి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిపంచారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇంటింటా తిరుగుతూ ఐఈసీపై అవగాహన కల్పించారు. అలాగే వీధి కుక్కలు దాడి చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం పలు వీధుల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. పెంచికల్‌పేట్ మండలం లోడుపల్లిలో వైద్యం శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఎంపీడీవో ఆల్బర్ట్ అవగాహన కల్పించారు.

కోటపల్లి : కొల్లూరు జీపీలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్ రావ్

దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, ఆగస్టు 8 : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీలో చేరాలనుకునే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరకాస్తులు చేసుకోవానలి మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ డిగ్రీ చేసేందుకు ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిప్లొమా చేసినవారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 73829 29719నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు..

దండేపల్లి, ఆగస్టు 8 : 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని దండేపల్లి ఉన్నత పాఠశాల సమన్వయకర్త బీసగోని శంకర్‌గౌడ్, సహాయ సమన్వయకర్త సంగర్షి రాజేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం పొందే అభ్యాసకులు నిజ ధ్రువీకరణ పత్రాలతో ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని, వివరాలకు 83097 69067 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

11న మెగా వైద్య శిబిరం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 8 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల రక్త నిధి కేంద్రం ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కోసం ఈ నెల 11న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి తెలిపారు. అమెరికన్ ఆంకాలజీ హాస్పటల్ హైదరాబాద్‌కు చెందిన సీఎస్ హిమటాలజిస్ట్, బోన్ మారో స్పెషలిస్ట్ డా. రంజిత్ కుమార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణంలోని మహాలక్ష్మి డెంటల్ హాస్పిటల్ వైద్యుడు రాజశేఖర్, చెందం కంటి వైద్య నిపుణుడు అభిషేక్, రఘు వంశీ పిల్లల వైద్యుడు, గ్యాస్ట్రాలజీ వైద్య నిపుణులు పరీక్షలు చేస్తారని తెలిపారు. మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో వైద్యం పొందుతూ క్యాంప్ కోసం బ్లడ్ శాంపిల్ ఇచ్చి పేర్లు నమోదు చేసుకున్న తలసేమియా, సికిల్ సెల్, సికిల్ తాల్ బాధితులు హాజరుకావాలని కోరారు. వారి వెంట మెడికల్ రిపోర్ట్స్ తీసుకురావాలని తెలిపారు.

పరిహారం చెక్కు పంపిణీ

లక్షెట్టిపేట, ఆగస్టు 8 : లక్షెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలోని టికానపల్లిలో ఈ నెల 4వ తేదీన రైతు చాకెపల్లి రమేశ్‌కు చెందిని లేగ దూడపై చిరుతపులి దాడిచేసి చంపేసింది. కాగా, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కింద రూ.12 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంచిర్యాల అటవీ క్షేత్ర డివిజన్ అధికారి సర్వేశ్వర్‌తో పాటు లక్షెట్టిపేట రేంజ్ ఆఫీసర్ అత్తె సుభాష్ చెక్కును గురువారం బాధిత రైతుకు అందజేశారు.

పోస్టర్ విడుదల

లక్షెట్టిపేట, ఆగస్టు 8 : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను లక్షెట్టిపేటలో గురువారం జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి విడుదల చేశారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యతతో ఉండాలని, మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కారక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, గౌరవాధ్యక్షుడు మాడావి శంకర్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడిమేత తిరుపతి, సలహాదారు సోయం జంగు, కొమ్ముల బాపురావ్, బాబు, కొవాజంగు, బద్ది శ్రీనివాస్, తోటి సేవా సంఘం లక్షెట్టిపేట నాయకులు శంకరయ్య, ఆత్రం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, ఆగస్టు 8 : మండలంలోని ఝరి గ్రామంలో ఆదివాసీ దినోత్సవ కరపత్రాలను నాయకులతో కలిసి రాజ్‌గోండ్ సేవా సమితి మండలాధ్యక్షుడు మడావి రఘునాథ్, ఆదివాసీ సీనియర్ నాయకుడు ఆత్రం లక్ష్మణ్‌రావ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కుర్సెంగ బారిక్‌రావ్ పటేల్, ఆడ చిత్రు, మడవి పురుషోతం, ఆత్రం లింగోరావ్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రహదారికి మరమ్మతులు

బెల్లంపల్లి, ఆగస్టు 8 : మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ శ్రీబుగ్గ రాజరాజేశ్వర్ స్వామి ఆలయ రహదారికి ఆలయ కమిటీ చైర్‌పర్సన్ మాసాడి శ్రీదేవి ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వర్షాలకు దారి బురదగా మారింది. శ్రావణమాసంలో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో బురద మట్టిని తొలగించి, మరమ్మతులు చేపడుతున్నారు. త్వరలో ఆలయ దారికి నిధులు కేటాయించి, శాశ్వత పరిష్కారం తీసుకుంటామని చైర్‌పర్సన్ వెల్లడించారు.

ఉద్యమకారులకు పింఛన్ ఇవ్వాలి

కాగజ్‌నగర్, ఆగష్టు 8 : ప్రత్యేక తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులకు పింఛన్, సమరయోధుల హోదా ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధన కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, లాఠీ దెబ్బలు తిన్నామని, జైలు పాలయ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రమణయ్య, మూర్తి, నాగేశ్వర్ రావు, లక్ష్మీనారాయణ, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై అట్రాసిటీ కేసు

భీమారం, ఆగస్టు 8 : సుంకరిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సెగ్యం అరుణ్‌కుమార్, కోట విష్ణుపై దాడిచేసిన, కులం పేరుతో దూషించిన నాంపల్లి సంతోష్‌తో పాటు మరో నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాములు తెలిపారు. ఎస్ఐ, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సెగ్యం అరుణ్‌కుమార్, కోట విష్ణు బైక్‌పై సుంకరిపల్లి నుంచి భీమారం బస్టాండ్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక తన్వీ వైన్స్ వద్ద ఐదుగురు యువకులు మద్యం మత్తులో అకస్మాత్తుగా కారు డోర్ తెరవడంతో వారికి తాకి కిందపడ్డారు. దీనిపై అరుణ్‌కుమార్, విష్ణు ఆ యువకులను ప్రశ్నించగా, దాడిచేశారు. ఫోన్ ధ్వంసం చేశారు. మెడలో చైన్ లాక్కుని పడేసి, అక్కడి నుంచి పరారయ్యారు. అందులో ఒకరు నాంపల్లి సంతోష్ కాగా, నలుగురు మంచిర్యాల పట్టణానికి చెందిన వారిగా తెలుస్తున్నది. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

తాండూర్, ఆగస్టు 8 : తాండూర్ మండలం ద్వారకాపూర్ పంచాయతీ పరిధిలో నర్సరీ, పారిశుధ్య పనులను ఎంపీడీవో అనిల్ కుమార్ పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. నిత్యం పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గంజాయి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 8: గంజాయి కేసులో నేరస్తుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పునిచ్చారు. జైనూర్ సీఐ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం 2021లో చింతకర్రకు చెందిన జాదవ్ తిరుపతి తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అప్పటి ఎస్ఐ తిరుపతి తనిఖీ చేశారు. సుమారు 200 గంజాయి మొక్కలు లభ్యమవగా, నిందితుడిపై కేసు నమోదు చేశారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో శిక్షను విధించారు.

కార్యదర్శుల కార్యవర్గం

ఎన్నికైన కార్యదర్శుల కార్యవర్గ సభ్యులు

దహెగాం, ఆగస్టు 8 : మండలంలోని పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చౌదరి రాజేశ్(అయినం), కార్యదర్శిగా ఆర్ రోహిదాసు(పీపీ ఆరవుకాలని), ఉపాధ్యక్షులుగా దుర్గం సుమలత(బీబ్రా), తలండి విజయ్‌కుమార్(రాంపూర్), ట్రెజరర్ ఇందారపు రఘుకుమార్ సోషల్ మీడియా కన్వీనర్‌గా గట్టు శివప్రసాద్ ఎన్నికయ్యారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

వాంకిడి.ఆగస్టు 8: సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. గురువారం వాంకిడి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల మండల కమిటీ అధ్యక్షురాలిగా శృతిక, ప్రధాన కార్యదర్శిగా తిరుమల, కోశాధికారిగా రవీందర్, ఉపాధ్యక్షురాలిగా కవిత, అధికార ప్రతినిధిగా సందీప్, సలహాదారులుగా స్వప్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమేశ్, వెంకట, రమణ, దేవేందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కెరమెరి, ఆగస్టు 8: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ జాదవ్ ఉల్లాస్ అన్నారు. గురువారం మండలంలోని ఝరి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్‌లలో వచ్చే మెస్సెజ్‌లను చూసి గుడ్డిగా నమ్మి మోసపోవద్దని, డబ్బులు ఆశ చూపి సైబర్ నేరగాళ్లు మోసం చేస్తారని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో సమస్యలుంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

13న ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 8: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ ర్యాలీకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మాదిగ ఉపకులాల పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు నారాయణ, ఏమ్ముర్ల పోశం, మహేశ్ పాల్గొన్నారు.

జలపాతం వద్ద వసతులు కల్పించాలి

తిర్యాణి, ఏప్రిల్ 8: మండలంలోని మందగూడ పంచాయతీ పరిధిలోని చింతలమాధర జలపాతం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఏకోటూరిజం(ఈటీసీ)కమిటీ చైర్మన్ తురం గోపాల్ వినతిపత్రం అందించారు. మరుగుదొడ్లు, డ్రెస్సింగ్ రూంల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని, వీటితో పాటు సీసీ కెమెరాలు, సోలార్ బల్బులు, జడ్పీ రోడ్డు నుంచి జలపాతం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానూకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రాము, ఈటీసీ కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

వేమనపల్లి, ఆగస్టు 8 : నీల్వాయి సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. విద్యుత్ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఈడీఈ రాజన్న హాజరయ్యారు. ఈ వేదికకు విద్యుత్ వినియోగదారులు ఎవరూ హాజరుకాలేదని, దరఖాస్తులు అందజేయలేదని అధికారులు తెలిపారు. 20 రోజుల క్రితం విద్యుత్ వైర్లు తెగి కింద పడడంతో వాటికి తగిలి పశువులు మృతిచెందాయని, బాధిత రైతులు విద్యుత్ అధికారులకు తెలియజేశారు. పరిహారం అందేలా చూస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ ట్రాన్స్‌కో ఏడీ రాంచందర్, వేమనపల్లి ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్, ఆగస్టు 8 : రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 178 మందకి అందించినట్లు స్పష్టం చేశారు. నాయకులు, ఆయా మండలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

లింగాపూర్, ఆగస్టు 8: మండలంలోని చిన్న దాంపూర్ నుంచి జాముల్‌ధార మీదుగా లొద్దిగూడ వెళ్లే రోడ్డు వర్షాలకు తెగిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో పూల్సింగ్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ అనిల్ కుమార్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా రోడ్డుకు మరమ్మతు చేయించాడు. అనిల్ కుమార్‌ను చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, వాహనదారులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి,ఆగస్టు 8: జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం తుడుందెబ్బ నాయకులు వినతి ప్రతం అందజేశారు. ఆసిఫాబాద్, తిర్యాణి, చింతలమానేపల్లి, వాంకిడి, జైనూర్, సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లో పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, సీఆర్టీలను తొలగించడం కూడా దీనికి కారణమని తెలిపారు. తిర్యాణిలో 30 పడకల వైద్యశాలలో పోస్టుమార్టంగది, డాక్టర్‌ను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోడసం భాస్కర్, కోట్నాక భారిక్‌రావు, రాయిసిడాం వినోద్, కోట్నాక గణపతి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె

దహెగాం, ఆగస్టు 8 : ఒకరోజు సమ్మెలో భాగంగా మండలంలోని పంచాయతీ కార్మికులు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని, మున్సిపాల్ ఉద్యోగుల మాదిరిగా జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు అందించాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో కార్మికల సంఘం మండలాధ్యక్షుడు చంద రమేశ్, గౌరవాధ్యక్షుడు గడ్డం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి జుమ్మిడి రవీందర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, ఆగస్టు 8 : కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ముంజం శ్రీనివాస్, నాయకులు రమేశ్, విజయ్, మహేశ్, రాజేశ్, మధు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టీ), ఆగస్టు 8 : ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి, యూనియన్ నాయకులు నగేశ్, రాజన్న, బాగ్గవ్, రాజ్‌కుమార్, నీలమ్మ, విక్రమ్, వెంకటేవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

జన్నారం, అగస్టు 8 : మండలంలోని కవ్వాల్ క్లస్టర్ దేవునిగూడ, కామన్‌పెల్లి గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ పామ్, పత్తి, వరి పంటను జిల్లా వ్యసాయ శాఖ అధికారి